క్లుప్తంగా

నేటి నుంచి లక్ష్మీనారాయణ స్వామి కల్యాణోత్సవాలు



వీరవల్లి అగ్రహారం లక్ష్మీనారాయణస్వామి

మాడుగుల రూరల్: మండలంలో వీరవల్లి అగ్రహారంలో కొలువైన లక్ష్మీనారాయణస్వామి వార్షిక కల్యాణోత్సవాలు శనివారం ప్రారంభం కానున్నాయని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొండా వరహాలు దొర తెలిపారు. ఈ ఉత్సవాలు ఈ నెల 13వ తేదీ వరకు జరుగుతాయన్నారు. శనివారం స్వామి వారి కల్యాణం, 9న స్వామికి పూజలు, 10న తిరువీధి ఉత్సవం, 11, 12 తేదీల్లో ఆలయంలో ప్రత్యేక పూజలు, 13న నాగవల్లి సంబరాలు, పుష్పాంజలి సేవతో ఉత్సవాలు ముగిస్తాయని ఆయన తెలిపారు.

భగవద్గీత పోటీల్లో కె.జె.పురం విద్యార్థిని ప్రతిభ



సూరిశెట్టి కుస్మితశ్రీకు జ్ఞాపిక అందిస్తున్న నిర్వాహకులు

మాడుగుల రూరల్: ఇటీవల అనకాపల్లిలో జైజై గీత భగవద్గీత ఫౌండేషన్ నిర్వహించిన భగవద్గీత పోటీల్లో ఆరో తరగతి చదువుతున్న కె.జె.పురం హైస్కూల్ విద్యార్థిని సూరిశెట్టి కుస్మితశ్రీ జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి సత్తా చాటింది. ఆంగ్ల ఉపాధ్యాయుడు జగన్మోహన్ శిక్షణతో ఆమె ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచింది. కుస్మితశ్రీను హైస్కూల్ హెచ్ఎం వి.దాసు, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.

అడుగంటుతున్న పెద్దేరు నది



మాడుగుల మండలం సత్యవరం వద్ద తగ్గిన పెద్దేరు నది నీటి ప్రవాహం

మాడుగుల: మండలంలో అత్యంత జల వనరులు గల పెద్దేరు నది ప్రవాహం ఈ ఏడాది ఫిబ్రవరి నెల ప్రారంభంలోనే తగ్గుముఖం పట్టింది. మాడుగుల మండలంలో జంపెన, సత్యవరం, డి.గొటివాడ, వీరవల్లి, ఎం.కోటపాడు, జేడీపేట, జాలంపల్లి, ఎల్.పొన్నవోలు గ్రామాల్లోని సుమారు 9 వేల ఎకరాలకు సాగునీరు, ప్రజలకు తాగునీటితో పాటు, పశువులు, మేకలకు ఈ నదే ప్రధాన జీవనాధారం. ఇకపై వర్షాలు పడకపోతే మే నెలకు పూర్తిగా నదిలో నీరు ఇంకిపోయే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

భక్తిశ్రద్ధలతో మండపారాధన పూజలు



క్షీరాధివాసం, సూర్యనమస్కారాలలో పాల్గొన్న ఆర్య వైశ్యులు

కె.కోటపాడు : కె.కోటపాడులో వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరుపుతున్నారు. గోరుగొంతు రమేష్‌బాబు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో మండపారాధన, క్షీరాధివాసము, ఆవాహిత, సూర్యనమస్కారాలు, పంచశయ్యాదివాసము, చతుర్వేదస్వస్తులు కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో చేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో మండలంలో పలు గ్రామాలకు చెందిన ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కుసర్లపూడి జెడ్పీ హైస్కూల్‌లో బోధనపై ఆరా



విద్యార్థుల విద్యా సామర్థ్యాలు తెలుసుకుంటున్న ఎంఈవో జగ్గారావు

రోలుగుంట: విధుల పట్ల సమయ పాలనే ఆ ఉద్యోగికి గుర్తింపుతో పాటు ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని మండల విద్యాశాఖాధికారి జగ్గారావు అన్నారు. శుక్రవారం కుసర్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. పదో తరగతి విద్యార్థులకు చేస్తున్న బోధనపై ఆరా తీశారు. పది ఫలితాలు సాధనపై హెచ్ఎం శెట్టి మోహన్‌కు పలు సూచనలు చేశారు. పది విద్యార్థులకు సోషల్ టీచర్ అప్పన రాంబాబు అందిస్తున్న బోధన తీరును చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు.

పుష్కరిణికి మోక్షం ఎప్పుడో?

- గౌరీశ్వరాలయం కోనేరుకు ఆక్రమణల బెడద
- నిర్వహణ లోపంతో అధ్వానంగా పార్కు



అధ్వానంగా ఉన్న కోనేరు పార్కు



అభివృద్ధికి నోచుకోని గౌరీశ్వరాలయ ప్రాంగణంలో పుష్కరిణి

చోడవరం: మహాశివరాత్రి ఉత్సవాలు త్వరలో ప్రారంభమౌతున్నప్పటికీ చోడవరం శ్రీస్వయంభూ గౌరీశ్వరాలయం పుష్కరిణి మాత్రం అభివృద్ధికి నోచుకోలేదు. సుమారు 400 ఏళ్ల చరిత్ర ఈ ఉన్న ఆలయం ప్రాంగణం ఎన్నో విశిష్టతలకు ప్రసిద్ధి చెందింది. భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకునేందుకు, ఆలయ వాస్తు, పవిత్రకు నిదర్శనంగా ఆలయ ప్రాంగణాల్లో పుష్కరిణి(కోనేరు)ని నాటి కాలంలో రాజులు తవ్వించారు. ఇలా పుష్కరిణి కలిగి ఉన్న ప్రాచీన దేవాలయాలు జిల్లాలో చాలా తక్కువే. అంతటి పవిత్రత ఉన్న ఆలయ పుష్కరిణిలు ఇప్పుడు అపరిశుభ్రంగా, అభివృద్ధికి నోచుకోక, ఆక్రమణల పాలవుతున్నాయి. చోళ రాజుల కాలంలో నిర్మించిన చోడవరం స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయం ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఉన్న అతికొద్ది ప్రాచీన ఆలయాల్లో ఒకటి. ఆలయ ప్రాంగణంలో ఈశాన్య భాగంలో పుష్కరిణి ఉంది. సుమారు మూడెకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ కోనేరులో స్నానమాచరించడం భక్తులు ఎంతో పవిత్రంగా భావిస్తారు. అయితే క్రమేనా ఈ కోనేరు అపరిశుభ్రంగా మారిపోవడంతో ఇప్పుడు భక్తులు ఎవరూ ఇక్కడ స్నానాలు ఆచరించని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం కోనేరు గర్భం ఆక్రమణలు పుణ్యమా అని కుదించుకుపోయింది. మెయిన్‌రోడ్డు, ఆలయానికి వచ్చే రోడ్లలో కోనేరు చాలా మేర ఆక్రమణకు గురైంది. గతంలో కోనేరును ఆనుకొని పార్కును నిర్మించారు. ఆ పార్కు కూడా నిర్వహణ లోపంతో అధ్వానంగా తయారైంది. కోనేరులో పూడిక తీసి, నాలుగు వైపులా ఆక్రమణలు తొలగించి అభివృద్ధి చేయాల్సి ఉంది. ఏటా కార్తీక మాసంలో కోనేరులో నీటిని శుభ్రపరిచి కొత్తనీరుతో నింపాల్సి ఉంది. ఆలయ దక్షిణ భాగంలో కూడా కొంత స్థలాన్ని పార్కుగా అభివృద్ధి చేసినప్పటికీ అది కూడా నిర్వహణ లోపంతో అధ్వానంగా తయారైంది. ప్రస్తుతం ఆలయ గర్భగుడి, గాలిగోపురం, పక్కనే శివపార్వతుల భారీ విగ్రహాలు, అర్ధనారీశ్వరుని నిలువెత్తు విగ్రహం నిర్మించడం వల్ల ఆలయం కొత్త రూపురేఖలతో సర్వాంగ సుందరంగా ఉంది. ఇటువంటి ఆలయానికి పుష్కరిణి కూడా అభివృద్ధి చేస్తే ఆలయ ప్రాచుర్యం మరింత పెరుగుతుందని భక్తులు అంటున్నారు. ఈ నెల 24 నుంచి మహాశివరాత్రి, స్వామివారి కల్యాణోత్సవాలు ప్రారంభం కానున్నాయి. మహాశివరాత్రి పర్వదినాన భక్తులు ఈ పుష్కరిణిలో పవిత్రం స్నానం చేసి స్వామివారిని దర్శించుకుంటారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పుష్కరిణి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

ఎం.కోడూరులో ధర్మశ్రీకి ఘన సత్కారం



ధర్మశ్రీని సత్కరిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్, సర్పంచ్ సంజీవరావు, ఆలయ కమిటీ సభ్యులు

మాడుగుల: వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడిగా ఇటీవల బాధ్యతలు చేపట్టి తొలి సారిగా మాడుగుల మండలం ఎం.కోడూరుకు వచ్చిన మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీకి సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు ఆధ్వర్యంలో గ్రామస్తులు, పార్టీ శ్రేణులు శుక్రవారం ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో వెలసిన మెదకొండమ్మ ఆలయంలో ప్రధాన అర్చకుడు శ్రీనివాసశర్మ ఆయన పేరిట ప్రత్యేక పూజలు చేశారు. ధర్మశ్రీకి దుశ్శాలువా కప్పి, అమ్మవారి చిత్రపటం అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ముమ్మిన రమణబాబు, ఉపసర్పంచ్ గెంజి రాజేష్ కుమార్, మాజీ కో–ఆపరేటివ్ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు, పడాల అప్పల నర్సయ్య, గోకేడ లక్ష్మీరావు, మింది అప్పలనాయుడు, గెంజి కృష్ణమూర్తి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

‘పంతాలకు పోతే వివాదాలు పరిష్కారం కావు’



ఫిర్యాదుదారులకు కౌన్సిలింగ్ చేస్తున్న ప్రత్యేక అధికారి నాగ శిరీష, మండల స్థాయి అధికారులు

నాతవరం: గ్రామంలోనే ఇరువురి సమక్షంలో వివాదాలను పరిష్కరించుకోవాలని, పంతాలు పట్టింపులకు పోతే నష్టపోయేది మీరేనన్న విషయాన్ని గ్రహించాలని మండల ప్రత్యేకాధికారి నాగశిరీష అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పీజీఆర్ఎస్ ఫిర్యాదుదారులతో సమావేశమయ్యారు. మండలంలో మర్రిపాలెం, పి.కె.గూడెం, ములగపూడి, బెన్నవరం, గుమ్మడిగొండ, వెదురుపల్లి, మన్యపురట్ల గ్రామాల నుంచి భూసమస్యలు, ఇంటి స్థలం వివాదాలకు సంబంధించి ఫిర్యాదులు ఎక్కువగా రావడంతో ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. రికార్డులు, క్షేత్ర స్థాయిలో ఉన్న దానిని అధికారులు స్వయంగా పరిశీలించారు. నిబంధనలు ప్రకారం ఏవిధంగా న్యాయం చేయాలన్న అంశాలను ఇరువురికి వివరించారు. వ్యక్తిగత పంతాలు పోదామనుకుంటే కోర్టులు, పోలీసు స్టేషన్ల చుట్టూ తిరగడమే తప్పా ప్రయోజనం ఉండదన్నారు. కుటుంబ సభ్యుల మధ్య వివాదాలు అధికంగా ఉన్నాయని, వాటిని ఒక క్షణం ఆలోచిస్తే సమస్య అవలీలగా పరిష్కారం చేసుకోవచ్చునన్నారు. అనంతరం మండల స్థాయిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు తీరుపై అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎ.వేణుగోపాల్, ఎస్ఐ సిహెచ్.భీమరాజు, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

‘ర్యాష్ డ్రైవింగ్ చేస్తే వాహనాలు సీజ్’



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ గోవిందరావు

నర్సీపట్నం: ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ చేస్తే జరిమానాలతో సరిపెట్టకుండా వాహనాలు సీజ్ చేస్తామని పట్టణ సీఐ జి.గోవిందరావు హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టౌన్ పోలీసులు శుక్రవారం ఎక్కడికక్కడ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మైనర్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్ చేసిన 45 మంది వాహనదారులను గుర్తించి, స్టేషన్‌కు తరలించారు. వాహనదారులకు స్టేషన్‌లో అవగాహన కల్పించారు. పిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అధిక మొత్తంలో జరిమానాలు విధించారు. రెండో సారి పట్టుబడితే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పు చేశాకే లారీలకు అనుమతి


- ఆర్డీవోకు స్పష్టం చేసిన మూడు గ్రామాల సర్పంచ్‌లు



ఆర్డీవో రమణకు వినతి పత్రం అందిస్తున్న సర్పంచ్‌లు, స్థానికులు

మాకవరపాలెం: భారీ వాహనాల రాకపోకలు చేయాలంటే రోడ్డు వెడల్పు చేయాలని శెట్టిపాలెం, భీమబోయినపాలెం, జడ్.గంగవరం గ్రామాల సర్పంచ్‌లు అల్లు రామునాయుడు, రుత్తల నందకిషోర్, దుంగల రమణ డిమాండ్ చేశారు. రోడ్డు పాడవడం, ప్రమాదాలకు కారణమవుతున్నాయంటూ బాక్సైట్ ఖనిజాన్ని తరలించే లారీలను ఇటీవల స్థానికులు అడ్డుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మూడు రోజులుగా వారి నిరసన కొనసాగుతూనే ఉంది. దీంతో జేసీ ఆదేశాలతో శుక్రవారం నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ నిరసన చేస్తున్న సర్పంచ్‌లతో చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు మాట్లాడుతూ వెంకన్నపాలెం నుంచి ఆన్‌రాక్(పయినీర్) కంపెనీ వరకు రోడ్డును 100 అడుగులు వెడల్పు చేయడంతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదాల నివారణకు సెక్యూరిటీ గార్డులను నియమించి, కాలుష్య నివారణకు గ్రీన్ బెల్ట్ ఏర్పాటు చేయాలన్నారు. భూములు కోల్పోయిన రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. వీటితో పాటు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్డీవోకు అందజేశారు. ఈ విషయాన్ని జేసీకి నివేదిస్తామని ఆర్డీవో తెలిపారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ తహసీల్దార్ రామారావు ఉన్నారు.

హోంమంత్రి సొంత జిల్లాలో లైంగిక దాడులు సిగ్గు చేటు



బంగారుమెట్ట కూడలిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

బుచ్చెయ్యపేట: విద్యార్థినులు, మహిళలకు రక్షణ కల్పించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం బంగారుమెట్టలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎం.రమణ మాట్లాడుతూ హోంమంత్రి అనిత సొంత జిల్లాలో లైంగిక దాడుల ఘటనలు జరగడం సిగ్గు చేటన్నారు. లైంగిక దాడులు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి నూకరాజు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



చెత్త ఊడ్చుతున్న సర్పంచ్ అప్పలనాయుడు

రోలుగుంట: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అంటూ కుసుర్లపూడి సర్పంచ్ మడ్డు అప్పలనాయుడు చాటి చెప్పారు. శుక్రవారం ఆయన గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికులతో కలిసి వీధిలో స్వయంగా చీపురు పట్టి చెత్త ఊడ్చారు. ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని గ్రామస్తులకు ఆయన సూచించారు. తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి తమకు ఇచ్చిన రెడ్, గ్రీన్ బాస్కెట్లో వేసి పారిశుధ్య సిబ్బందికి ఇవ్వాలని ఆయన కోరారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న లోవరాజు

నర్సీపట్నం: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి డి.లోవరాజు అన్నారు. పెదబొడ్డేపల్లి ఏపీఆర్ స్కూల్‌లో మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ఫలితాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ చాలా విలువైందన్నారు. చదువుపై దృష్టిసారించినప్పుడే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలరన్నారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే జీవితాలు నాశనమవుతాయన్నారు. ఆడపిల్లలను వేధిస్తే పోక్సో కేసు నమోదు చేస్తారని హెచ్చరించారు. ఫలితంగా జీవితాలు నాశనమవుతాయన్నారు. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని చెప్పారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి తీర్థం

చీడికాడ: అప్పలరాజుపురం గ్రామంలో అభయాంజనేయ స్వామి తీర్థం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ఉదయం నుంచి పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించారు. సర్పంచ్ చుక్కా అప్పలనాయుడు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, నాయకులు సారథ్యంలో సాయంత్రం మహిళల కోలాటం ప్రదర్శన ఆకట్టుకుంది.

రామాలయం నిర్మాణానికి విరాళం



విరాళం అందిస్తున్న వార్డు కార్యదర్శి రమణ

రోలుగుంట: బుచ్చింపేటలో తలపెట్టిన సీతారాముల ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన వార్డు కార్యదర్శి అనిమిరెడ్డి రమణ శుక్రవారం రూ.10 వేలు విరాళం అందజేశారు. సాయం అందించిన రమణకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

బాలికలకు రక్షణ కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలం

- హోంమంత్రి సొంత జిల్లాలోనే అధికంగా లైంగిక వేధింపులు
- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న ధ్వజం

దేవరాపల్లి: మహిళలకు, మైనర్ బాలికలకు రక్షణ కల్పించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న విమర్శించారు. ఈ మేరకు దేవరాపల్లిలో శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలో ఏడు నెలల్లో 20 పోక్సో కేసులు నమోదు కావడం పరిస్థితికి అద్దం పడుతుందన్నారు. హోంమంత్రి అనిత సొంత జిల్లాలోనే ఇంతటి దారుణాలు జరగడం అవమానకరమన్నారు. యలమంచిలి మండల పరిధిలో రెండు వారాల వ్యవధిలో ఇద్దరు బాలికలపై అఘాయిత్యాలు జరిగాయని, రోలుగుంట మండలం జేసీ అగ్రహారంలో దివ్యాంగ బాలికపై లైంగిక దాడి జరిగిందని, రాంబిల్లిలో మైనర్ బాలికలను హత్య చేశారని, నర్సీపట్నంలో విద్యార్థినిని యువకుడు వేధింపులకు గురిచేశాడన్నారు. తాజాగా బుచ్చెయ్యపేట మండలం స్కూల్‌లో విద్యార్థిని పట్ల ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించాడని, అనకాపల్లిలో బాలికపై అత్యాచారానికి యత్నించాడని ఆయన పేర్కొన్నారు. గ్రామాల్లో విచ్చల విడిగా మద్యం బెల్టు షాపుల నిర్వహణ కారణంగా అఘాయిత్యాలు పెరిగిపోయాయని చెప్పారు.

ఘనంగా సంతోషిమాత అమ్మవారి తీర్థం

- నిత్యాన్నదాన సత్రాన్ని ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ
- అమ్మవారిని దర్శించుకున్న మాజీ డిప్యూటీ సీఎం ముత్యాలునాయుడు



సంతోషిమాత అమ్మవారి సన్నిధిలో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు, తదితరులు



నిత్యాన్నదాన సత్రం రెండో అంతస్తును ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లో కొలువైన సంతోషిమాత అమ్మవారి తీర్థం శుక్రవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కాళ్ల అమ్మతల్లినాయుడు ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంటరీ పరిశీలకుడు కరణం ధర్మశ్రీ, స్థానిక నాయకుడు పైలా ప్రసాదరావు, ఆర్‌వీఎస్ఎల్ ఇంజినీర్ వేగి రామునాయుడు, గౌరీ సంఘం అధ్యక్షుడు ఎ.వి.రమణ, ప్రముఖ వైద్యుడు వేగి సూర్యనారాయణ, తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయం సమీపంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

నిత్యాన్నదాన సత్రం ప్రారంభం

ఆలయం పక్కన నిర్మించిన సంతోషిమాత నిత్యాన్నదాన సత్రాన్ని భక్తులతో ఆలయ కమిటీ అధ్యక్షుడు అమ్మతల్లినాయుడు పర్యవేక్షణలో ప్రారంభించారు. రెండో అంతస్తును కరణం ధర్మశ్రీ ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు దివంగత మారుమోఖం కొండమ్మ జ్ఞాపకార్థం ఇచ్చిన స్థలంలో దాతలు సహకారంతో తక్కువ సమయంలో అన్నదాన సత్రం నిర్మించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బుచ్చెయ్యపేట జెడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, సర్పంచ్ జామి రమణబాబు, కాళ్ల అప్పలనాయుడు, మద్దాల రమణ, శ్రీనాథు శ్రీనివాసరావు, మాడుగుల సర్పంచ్ యడ్ల కళావతి, బొమ్మిశెట్టి, శ్రీనివాసరావు, కరణం రాము పాల్గొన్నారు. స్థానిక మహిళల కోలాటం ప్రదర్శన ఆకట్టుకుంది.

15 లోగా పశుగణన పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఏడీ నాయుడు

కె.కోటపాడు : దేవరాపల్లి, కె.కోటపాడు మండలాల్లో పశువైద్య సహాయకులు ఈ నెల 15వ తేదీ లోగా పశుగణన కార్యక్రమాన్ని పూర్తి చేయాలని పశుసంవర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్.వై.నాయుడు అన్నారు. కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల పశువైద్య సహాయకులతో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్న నట్టల నివారణ మందులను ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలకు వేయాలని సూచించారు. బహువార్షిక పశుగ్రాసం పెంపకం పట్ల ఆసక్తి గల రైతుల తమ పేర్లను పశువైద్య సహాయకులకు ఇవ్వాలని సూచించారు. ఈ గడ్డి పెంపకాన్ని చేపట్టే రైతులు నీటి వసతి అందుబాటులో ఉండడాన్ని ప్రామాణికంగా తీసుకోవాలని సూచించారు. కిసాన్ క్రెడిట్ కార్డులు రైతులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ క్రెడిట్ కార్డుల ద్వారా రైతులకు రూ.3లక్షల వరకూ రుణాన్ని తక్కువ వడ్డీకే బ్యాంక్‌లు అందించనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారులు సింహాచలంనాయుడు, మంజూషరాణి, ప్రియాంక పాల్గొన్నారు.

ఆర్‌సీఎం స్కూల్ మెగా ఈవెంట్‌కు సన్నాహాలు

నర్సీపట్నం: పెదబొడ్డేపల్లి ఆర్‌సీఎం స్కూల్ పూర్వ విద్యార్థుల మెగా ఈవెంట్ నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు కార్యక్రమం నిర్వహణపై చర్చించేందుకు శనివారం కొంత మంది పూర్వ విద్యార్థులు స్కూల్‌లో సమావేశం కానున్నారు. 1947లో ఈ స్కూల్‌ను ప్రారంభించారు. ఈ పాఠశాల నుంచి 55 బ్యాచ్‌లు ఎస్ఎస్ఎల్‌సీ, ఎస్ఎస్‌సీ చదివి బయటకు వచ్చి ఉన్నత విద్యను అభ్యసించారు. అనేక మంది పూర్వ విద్యార్థులు వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. కొందరు ప్రస్తుతం ఉద్యోగాలు చేస్తుండగా, మరికొంత మంది రిటైర్మెంట్ కూడా అయ్యారు. ఆ స్కూల్‌కు వన్నెతెచ్చిన అప్పటి హెచ్ఎం ఇన్నయ్య ఫాదర్, ఉపాధ్యాయుడు జోజిబాబు కూడా ఇటీవల మృతి చెందారు. వారి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ మెగా ఈవెంట్ నిర్వహించేందుకు పూర్వ విద్యార్థులు సంకల్పించారు. మార్చి 8న మెగా ఈవెంట్ నిర్వహించేందుకు పూర్వ విద్యార్థులు సిద్ధమవుతున్నారు.

తాగునీరు వృథా.. వ్యథ



పైలట్ ప్రాజెక్టు నుంచి లీకేజీ ద్వారా వృథాగా పోతున్న తాగునీరు

నాతవరం: తాగునీటి పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి మూడు రోజులుగా నీరు వృథాగా పోతోంది. దీంతో పలు గ్రామాల ప్రజలకు తాగునీరు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో చిక్కుడుపాలెం వద్ద తాండవ నదీలో పైలట్ ప్రాజెక్టు ఏర్పాటు చేసి 16 గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఇక్కడి నుంచి గ్రామాలకు ఏర్పాటు చేసిన పైపులైన్ పలు చోట్ల శిథిలమైపోయింది. లీకేజీలు ఏర్పడి తాగునీరు వృథాగా పోతోంది. ఎం.బి.పట్నం పంచాయతీ శివారు ఎ.శరభవరం గ్రామ సమీపంలో నర్సీపట్నం–తుని మధ్య పట్టపగలే రోడ్డును ఆనుకుని ఉన్న పైపులైన్ నుంచి నీరు పోతున్నా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కన్నెత్తి చూడలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపులైన్ లీకేజీలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా అడవిరాజులబాబు పండగ



ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

మాకవరపాలెం: అడవిరాజులబాబు పండగను మండల కేంద్రం మాకవరపాలెంలో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా కొత్తవీధి నుంచి అడవిరాజులబాబు చిత్ర పటంతో ప్రారంభమైన ఊరేగింపు కిందివీధి, బీసీ కాలనీ మీదుగా ఆలయానికి చేరుకుంది. డప్పులు, వాయిద్యాల మధ్య కొనసాగిన ఈ ఊరేగింపులో విచిత్ర వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. గ్రామస్తులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయంలో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు అలరించాయి. మాజీ జెడ్పీటీసీ రుత్తల శేషుకుమార్, ఎంపీటీసీ రుత్తల సర్వేశ్వరరావు, ఉప సర్పంచ్ లాలం రాము, పెద్దలు పాల్గొన్నారు. శెట్టిపాలెంలో కూడా అడవిరాజుల బాబు పండగ జరిగింది.

వైఎస్సార్‌సీపీ నాయకుడు హరికృష్ణ మృతికి సంతాపం



గూడెపు హరికృష్ణ (ఫైల్)

మాడుగుల: వొమ్మలి ఎంపీటీసీ గూడెపు సత్యవతి భర్త, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు హరికృష్ణ(66) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం స్వగ్రామం వొమ్మలి జగన్నాథపురంలో మృతి చెందారు. కాంగ్రెస్‌లో చురుకుగా ఉండే ఈయన మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ ప్రారంభించినప్పుడు మాజీ మంత్రి బూడి ముత్యాలనాయుడు సమక్షంలో చేరారు. హరికృష్ణ మృతి గ్రామంలో వైఎస్సార్‌సీపీకి తీరని లోటని ఎంపీపీ తాళ్ళపురెడ్డి వెంకట రాజారామ్, మాజీ ఎంపీపీ వేమవరపు రామధర్మజ అన్నారు. మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సంతాపం తెలిపారు. ఈయన అంత్యక్రియలు స్వగ్రామం వీజే పురంలో శనివారం ఉదయం జరగనున్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు.